

రామగుండం నగరానికి మంచి రోజులు

- గడపగడపకు తిరుగుతూ ప్రజా సమస్యల పరిష్కారం
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్

8



డివిజన్‌లో మురుగుకాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



రైతు భరోసా అమలుకు సన్నాహాలు

- రైతుబంధు పథకం లోపాలపై ప్రక్షాళన
- సహకార సంఘాల్లో రైతులతో సమావేశాలు
- అభిప్రాయాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ
- పదెకరాలకు పరిమితం చేయాలంటున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రైతుబంధు పథకంలో గల లోపాలను సవరించి మార్పులు, చేర్పులు చేసి రైతుభరోసా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఈ మేరకు మూడు రోజుల నుంచి జిల్లాలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో వ్యవసాయ శాఖాధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018 యాసంగి సీజన్ నుంచి రైతుబంధు పథకాన్ని తీసుకువచ్చారు. పట్టా కలిగిన ప్రతీ రైతుకు మొదట ఎకరానికి నాలుగు వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందజేశారు. ఆ తర్వాత దానిని ఎకరానికి ఐదు వేల రూపాయలకు పెంచారు. ఈ పథకాన్ని ఎలాంటి సీలింగ్ లేకుండా అమలు చేశారు. భూస్వాములకు, ప్రభుత్వ ఉద్యోగులకు, నాలా కన్వర్షన్ చేయకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా వెలసిన వ్యవసాయ భూములకు, రహదారులు, ఇతర ప్రాజెక్టుల కింద సేకరించిన భూములకు, వ్యవసాయానికి అనువుగా లేని భూములు, కొండలు, గుట్టలు, బంచరాయి భూములకు కూడా రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని అందించారు. గత ఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే రైతుభరోసా పథకం ద్వారా ఎకరానికి 7,500 చొప్పున రెండు సీజన్లకు కలిపి 15 వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చింది. దీంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన యాసంగి సీజన్‌లో గతంలో వలే పెట్టుబడి సాయాన్ని అందించింది.

● ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఉపసంఘం..

ఈ వానాకాలం సీజన్ నుంచి రైతుభరోసా పథకాన్ని అమలు చేసే అవకాశాలు కనబడుతున్నాయి. అయితే పథకంలో లోపాలను సవరించి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభ్యులుగా ఉప సంఘాన్ని నియమించారు. ఈ ఉపసంఘం రైతు సంఘాలు, రైతు కూలీ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ వర్గాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి జూలై 15లోపు నివేదిక అందజేయాల్సి ఉంటుంది. అలాగే వ్యవసాయ శాఖ రైతులతో నిర్వహించే సమావేశాల్లో రైతులు వ్యక్తం చేసే అభిప్రాయాలను క్రోడీకరించి ఉపసంఘానికి అందజేయనున్నారు. వీటన్నింటిని పరి శీలించి ఒక నివేదికను ఉప సంఘం ప్రభుత్వానికి అందజేయ నున్నది. ఆ నివేదికను వచ్చే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఎమ్మెల్యేల అభిప్రాయాలను స్వీకరించి విధివిధానాలను ఖరారు చేయనున్నది. సహకార సంఘాల్లో నిర్వహిస్తున్న సమావేశాల్లో రైతులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. వివిధ అవసరాల కోసం, బ్యాంకు రుణాల కోసం ఒకటి, రెండు ఎకరాల భూములు కలిగిన రైతులు పాన్ కార్డులు పొంది ఐటీ రిటర్న్ దాఖలు చేస్తున్నారని, ఐటీ ఆధారంగా పథకాన్ని అమలు చేయవద్దని చెబుతున్నారు. మరికొందరు రైతులు భూస్వాములు, ప్రభుత్వ ఉద్యోగులకు పెట్టుబడి సాయాన్ని ఇవ్వవద్దని, వారికి ఎలాగు కౌలు వస్తున్నదని చెబుతున్నారు. 10 ఎకరాల వరకు సీలింగ్ విధించాలని, నాలా కన్వర్షన్ చేయకుండా వాణిజ్య అవసరాలకు సద్వినియోగం చేసుకుంటున్న భూములకు పథకాన్ని వర్తింపజేయవద్దని అంటున్నారు. వివిధ ప్రాజెక్టుల కిందపోయిన భూములను ప్రభుత్వ భూముల కింద నమోదు చేయాలంటున్నారు. సాగుకు యోగ్యంగా లేని భూములకు పెట్టుబడి సాయాన్ని ఇవ్వవద్దని చెబుతున్నారు. రైతులు వెలి బుచ్చుతున్న అభిప్రాయాలన్నింటినీ వ్యవసాయ శాఖాధికారులు నమోదు చేస్తున్నారు. ఈ నెల 3వ తేదీ వరకు రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ జరుగుతుందని, రైతుల అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జూలై 1: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని రామగుండం సీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి, పెద్దపల్లి, గోదావరిఖని సబ్‌డివిజన్ పరిధిలో జూలై 1 నుంచి 31వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్‌లో పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్, ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్, హెల్త్ వివిధ డిపార్ట్‌మెంట్ల అధికారులు, పోలీస్ శాఖ పరంగా ప్రతి డివిజన్ పరిధిలో ఒక ఎస్‌ఐ, నలుగురు సిబ్బందితో టీములు ఏర్పాటు చేసినట్టు రామగుండం సీపీ శ్రీనివాస్ సోమవారం ప్రకటించారు. ఈ టీముల ద్వారా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించనున్నట్టు వివరించారు. అన్నిశాఖల సమన్వయంతో పనిచేసి ముస్కాన్-ఎక్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. 18 సంవత్సరాల లోపు తప్పిపోయిన, వదిలివేయబడిన, వివిధ రకాల బాలకార్మికులు కిరాణం షాప్‌ల్లో, మెకానిక్ షాపుల్లో, హోటళ్లలో, వివిధ కంపనీల్లో పనిచేస్తూ, రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం, లేదా స్టేట్ హోమ్‌కు పంపిస్తామని వివరించారు. చిన్న పిల్లలతో ఎవరైనా బలవంతంగా భిక్షాటన, వెట్టిచాకిరీ చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలల హక్కుల సంరక్షణ ద్వారానే సంపూర్ణ మానవ అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ దిశగా అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళిక రుపొందించుకోని బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేలా చర్యలు చేపడుతున్నామని సీపీ పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేటు పరిధిలో ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే 1098, డయల్ 100కు లేదా స్థానిక పోలీస్‌లకు సమాచారం అందించాలని, ఈ ట్రోల్ ఫ్రీ నంబర్లు 24గంటలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మంచిర్యాల సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ 9848815120, జైపూర్ సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ 9441122702, బెల్లంపల్లి సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ 9490435081, పెద్దపల్లి సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ 8712656507, గోదావరిఖని సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ 9885508894 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీపీ పేర్కొన్నారు.

కొత్త చట్టాల ప్రకారం సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో మొదటి కేసు

కోల్‌సిటీ, జూలై 1: రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల జోన్ సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో కొత్త చట్టాల ప్రకారం మొదటి కేసు నమోదు అయ్యిందని రామగుండం సీపీ శ్రీనివాస్ సోమవారం ప్రకటించారు. నస్పూర్ ఎఫ్‌సీఐ కాలనీలో మెర్పల్లి అలియాస్ మారయ్య జూలై 1 తన ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై చనిపోయాడని, అతని సోదరుడు మెర్పల్లి అలియాస్ సదయ్య ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు జూలై 1 నుంచి భారతదేశ కొత్త చట్టాలు అమలు కావడంతో సీసీసీ నస్పూర్ ఎస్‌ఐ తులసి జితేందర్ సింగ్ సెక్షన్ 194బీఎస్ఎస్ఎస్ (భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టం) ప్రకారం కేసు నమోదు చేశామని వివరించారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న పోలీసు అతిధికారులకు, సిబ్బందికి విడతలవారీగా శిక్షణ కార్యక్రమం నిర్వహించామని సీపీ తెలిపారు.

జిల్లా గణాంక దర్శిని పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, తదితరులు

పెద్దపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా గణాంక దర్శిని (డిస్ట్రిక్టు హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ 2022-23) పుస్తకాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్‌లు జే అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ప్రొఫెసర్ పీసీ మహలనోబీస్ జయంతి జూన్ 29న సందర్భంగా సామాజిక, ఆర్థిక, ప్రణాళిక విధాన రూపకల్పనలో గణాంకాల పాత్ర గురించి యువతలో అవగాహన కల్పించడానికి జాతీయ గణాంకాల దినోత్సవం జరుపుకుంటు న్నామని కలెక్టర్ తెలిపారు. రోజు వారి జీవితంలో గణాంకాల వాడకం, విధానాలను రూపొందించడంలో గణాంకాలు ఎలా సహాయపడతాయో అన్న విషయంలో ప్రజలను చైతన్యవంతం చేయాల న్నారు. ఈ సందర్భం గా జిల్లా గణాంకదర్శిని పుస్తకం ఆవిష్కరించామని అన్నారు. సమాజంలో మ్యాక్రో, మైక్రో స్థాయిలో సామాజిక ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు గణాం కాలు అవసరం అవుతాయని, గణాంకాలను వినియోగించే వివిధ పాలసీలను రూపొందించడం జరుగుతుందన్నారు. గణాంకదర్శినిలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, విద్య, రవాణా, కమ్యూ నికేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎకానమీ, సోషల్ సెక్యూరిటీకి సంబంధించిన అంశాలు వివరంగా ఉంటాయని తెలిపారు. పెద్దపల్లి గణాంక దర్శిని పుస్తకం సాధారణ ప్రజలు, ప్లానర్స్ పరిపాలన, రీసెర్చ్ స్కాలర్లకు వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలు రూపకల్పన చేయుటకు ఉపయోగపడుతుందని తెలిపారు. దీన్ని రూపొందించేందుకు సహకరించిన జిల్లా అధికారులకు, రూపొందించిన ముఖ్య ప్రణాళిక అధికారి గంప రవీందర్, వారి సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. అనంతరం ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో సీపీవో కార్యాలయంలో పీసీ మహలనోబీస్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ముఖ్యప్రణాళిక అధికారి గంప రవీందర్, జిల్లా అధికారులు, ఉపగణాంక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్, జూలై 1: వైద్య ఆరోగ్య శాఖలో కొన్నేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఈసీ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేస్తామని ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో సుమారు ఈసీ ఏఎన్‌ఎంలు 300పైగా విధులు నిర్వహిస్తున్నారని, వెంటనే రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో డి సంతోషా, శ్రీమతి, శారద, పర్వీన్, కనకలక్ష్మీ, శైలజ, జ్యోతి పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

రామగిరి, జూలై 1: పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో అధికంగా ఫీజులు వసూళ్లకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు సోమవారం టీఎస్ఎస్ఎఫ్ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు ఎండీ వాజి ద్ ఆధ్వర్యంలో రెమ్మ సతీష్, అజయ్, మోయిన్ వినతిప త్రం అందజేశారు. పాఠశాల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు అమ్మకాలు కొనసాగిస్తున్నారని, నర్సరీకే రూ. 15 వేలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌కు రూ. 30వేల చొప్పున వసూళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలల్లో వసతులు మెరుగు పరచాలని కోరారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పెద్దపల్లిటౌన్, జూలై 1: రాష్ట్రంలో నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సమయంలో నేతకాని సమాజానికి సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని గుర్తు చేశారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో నాయకులు మానుగు కొమురయ్య, గోల్లె లక్ష్మణ్ పాల్గొన్నారు.

అధికారులు పనితీరును మెరుగుపరుచుకోవాలి

- ఆటంకాలు లేని విద్యుత్ సరఫరా చేయాలి
- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

సుల్తానాబాద్, జూలై 1: సుల్తానాబాద్ మండలంలో విద్యుత్ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే విజయరమణారావు తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని అన్నారు. సుల్తానాబాద్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ బాలాజీరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సరఫరా పరిస్థితి అస్తవ్యస్థంగా ఉందని, చినుకుపడితే చాలు గంటలగంటలు కరెంట్ పోతుందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభలో ప్రస్తావించారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతు విద్యుత్ కోతలు రాష్ట్రంలో లేవని, ఎక్కడా కూడా కరెంట్ సరఫరాలో అంతరాయం జరగడం లేదని, పైన బాగానే ఉంటున్నా స్థానికంగా తలెత్తుతున్న పలుసాంకేతిక సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలం అవుతున్నారని దాంతో సుల్తానాబాద్ పట్టణం, మండలంలో సమస్య ఏర్పడిందని అన్నారు.

నెల రోజుల్లో విద్యుత్ అధికారులు తమ పనితీరును మెరగుపరుచుకోవాలని సూచించారు. లేకుంటే చర్యలు తీసుకో కతప్పదని హెచ్చరించారు. ఇదే విద్యుత్ అంశంపై తాను జిల్లా స్థాయిలో అధికా రులతో సమీక్షా సమావేశం కూడా నిర్వహించానని ప్రజలకు నాణ్యతతో కూడుకున్న విద్యుత్‌ను అందించాలని అదేశించామన్నారు. ఆటంకాలు లేని సేవల కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కూడా తాను అధికారులను అదేశించానని ఎమ్మెల్యే వివరించారు. ఈ అంశం చర్చకు రావడనికి ముందు కూడా ఎమ్మెల్యే జోక్యం చేసుకుని కరెంట్ సమస్యలు ఉంటే ప్రస్తావించాలని కూడా సభ్యలను కోరారు. అనంతరం మండలంలోని ముగ్గురు ఏఈలను సమాధానం చెప్పాలని సూచించారు. సభలో పలు అంశాల గురించి సభ్యులు ప్రస్తావించారు.



ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

● పెండింగ్ బిల్లుల మంజూరుకు కృషి

మండలంలో ప్రజాప్రతినిదులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను మంజూరు చేయించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే అన్నారు. అలాగే రూర్బన్ పనుల విషయంలో కూడా న్యాయం చేస్తానన్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు ఎదురుకుంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

● ఎంపీపీ దంపతులకు ఘన సన్మానం

మండల పరిషత్ అధ్యక్షులు బాలాజీరావు పదవీ కాలం మరో మూడు రోజుల్లో పూర్తి కానున్న నేపథ్యంలో ఈ చివరి సమావేశంలో బాలాజీరావు స్వరూప దంపతులను ఎమ్మెల్యే విజయరమణారావు, జడ్పీటీసీ మినుపాల స్వరూపప్రకాశ్‌రావు, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తదితర అధికారులతో పాటు ఎంపీటీసీలు ఘనంగా సన్మానించారు. ఐదేళ్లలో మండల అభివృద్ధికి సహకరించిన వారందరికీ ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు.

ముత్తారం ప్రభుత్వ డాక్టర్, ఫార్మసిస్ట్‌కు మెమో జారీ

ముత్తారం, జూలై 1: ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యుడు అమరేంద్రరావు, ఫార్మసిస్ట్ జగదీష్‌కు మెమో జారీ చేసినట్లు జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ సోమవారం తెలిపారు. మండలంలోని మచ్చుపేట, ఖమ్మంపల్లి పల్లె దవాఖానాలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు దీప్తి, లావణ్య ఇక్కడ పని చేయకుండా ముత్తారం ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించడంతో ఆయా గ్రామాల రోగులు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు డిఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి సమాచారం లేకుండా ఇద్దరినీ ముత్తారం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయించిన వైద్యుడు అమరేంద్రరావుకు ఆసుపత్రిలో అందుబాటులో లేని ఫార్మాసిస్ట్ జగదీష్ కు మెమోలు జారీ చేసినట్టు డీఎంహెచ్‌వో తెలిపారు.

3న మండల సర్వసభ్య సమావేశం

రామగిరి, జూలై 1: ఈ నెల 3న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శైలజా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై సమీక్షా సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 1: బీజేపీ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాలనీలోని పాఠశాలల్లో బీజేపీ నాయకులు మొక్కలను నాటారు. 16వ డివిజన్ శ్రీవాణి స్కూల్, 17వ డివిజన్‌లోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో మొక్కలను నాటారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న శ్యామప్రసాద్ ముఖర్జీ జాతీయవాద పార్టీ దేశానికి అవసరమని జనసంఘ్‌ను స్థాపించాడన్నారు. కార్యక్రమాల్లో దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసిపేట శివాజీ, నాయకులు మూకిరి రాజు, పెద్దపల్లి రవీందర్, కొమ్ము గట్టయ్య, శశికుమార్, దాసరి శ్రీనివాస్, రౌతు రమేష్, దేవేందర్, లింగం నాయక్, గంధం శంకర్, పాష తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో మ్యుటేషన్ తిప్పలు

- రిజిస్ట్రేషన్ చేసి చేతులు దులుపుకుంటున్న సబ్‌రిజిస్ట్రార్‌లు
- పార్టీషన్ డీడ్‌లకు మ్యుటేషన్ ససేమిరా
- మున్సిపల్ కార్యాలయాల్లో గొడవకు దిగుతున్న బాధితులు

కోల్‌సిటీ, జూలై 1: మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తుల బదలాయింపునకు సంబంధించి ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు. ఆస్తుల కొనుగోళ్లు, వారసత్వ ఆస్తుల విభజన, భవనాల్లో కొంత భాగం అమ్మకాలకు సంబంధించి మ్యుటేషన్లలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో మున్సిపల్ రికార్డుల్లో ఆస్తి యజమాని పేరు మార్పు (మ్యుటేషన్)కు సంబంధించి ప్రత్యేకంగా ఆస్తి విలువలో కొంత శాతం వసూలు చేసి మ్యుటేషన్ చేసేవారు. గత ప్రభుత్వం మ్యుటేషన్‌కు మున్సిపాలిటీలకు సంబంధం లేదని, భవనాలు, ఖాళీ స్థలాలకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే మ్యుటేషన్ ఫీజు వసూలు చేసేలా ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో మ్యుటేషన్ ఫీజు వసూలు చేసి ఆన్‌లైన్‌లోనే ఇంటి నంబర్లు ఇస్తున్నారు. ఇక్కడే సమస్యలు వచ్చిపడుతున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు, మున్సిపాలిటీలకు సమన్వయం లేకపోవడం, సాఫ్ట్‌వేర్ ఇబ్బందులతో కొనుగోలుదారులు నానాఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ మున్సిపాలిటీల పరిధిలో ఎక్కడ ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు జరిగినా మున్సిపల్ రికార్డుల్లో మ్యుటేషన్‌కు సంబంధించి కూడా ప్రక్రియ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనే జరుగుతోంది. మున్సిపల్ ఆస్తిపన్ను రికార్డుల నిర్వహణకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సరైన అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

● ఇద్దరు యజమానులకు ఒకే ఇంటి నంబర్..

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని మార్కండేయకాలనీలో ఒక పాక్షిక నిర్మాణానికి సంబంధించి ఇంటి నంబర్‌తో యజమానురాలు రిజిస్ట్రేషన్ చేసింది. కొనుగోలుదారుకు ఇంటి నంబర్ వచ్చింది. కానీ పాత నంబర్ రద్దు కాలేదు. దీంతో పాత నంబర్‌పై, కొత్త నంబర్‌పై ఆస్తి పన్ను వస్తుంది. గౌతమినగర్‌లోని ఒక వామపక్ష రాజకీయ పార్టీ అనుబంధ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలకు సంబంధించి ఇటీవల కాలంలో ఆస్తుల బదలాంపులు జరిగాయి. ఇందులో షాపింగ్ కాంప్లెక్స్ ఒకరి పేరుపై రిజిస్ట్రేషన్ అయ్యింది. మిగతా భవనాలు, ఖాళీ స్థలం ట్రస్ట్‌లోని సభ్యుల పేర ఉంది. కానీ ఇంటి నంబర్ల కేటాయింపులో ఇబ్బందులు తలెత్తాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆస్తులకు సంబంధించి కుటుంబ సభ్యుల పేర బదలాయింపులు(పార్టీషన్ డీడ్) జరిగినప్పుడు మ్యుటేషన్లు కావడం లేదు. ఒక ఆస్తికి సంబంధించి కొంత భాగం అమ్మకాలు జరిగినప్పుడు కొనుగోలుదారుకు కొత్త నంబర్ కేటాయించాల్సి ఉంటుంది. కానీ అప్పటి వరకు ఉన్న పాత నంబర్‌నే కొనుగోలుదారులకు కేటాయిస్తున్నారు. రెండు ఆస్తులకు సంబంధించి ఇద్దరు యజమానులకు ఒకే ఇంటి నంబర్ ఉండడంతో ఆస్తి పన్ను చెల్లింపులోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సబ్‌రిజిష్టర్ కార్యాలయంలో స్టాంప్ డ్యూటీ, మ్యుటేషన్ ఫీజులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నా నెలల తరబడి మున్సిపాలిటీల్లో మ్యుటేషన్ కావడం లేదు. దీంతో ప్రజలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో గొడవకు దిగుతున్నారు. ఆస్తుల కొనుగోలు జరిగిన సందర్భాల్లో ఆస్తిలో కొంతభాగం విక్రయిస్తే కొనుగోలుదారులకు ఇంటి నంబర్ మున్సిపల్‌లోని మరో డివిజన్‌లో వస్తుంది. సాధారణంగా అసలు ఆస్తి ఇంటి నంబర్‌కు బై నంబర్లు కేటాయిస్తారు. కానీ ఆస్తి ఒక డివిజన్‌లో ఉంటే ఇంటి నంబర్ మాత్రం మరో డివిజన్‌కు చెందినవి కేటాయింపు చేస్తున్నారు. దీంతో సాంకేతిక అవరోధాలు తలెత్తుతున్నాయి. ఆస్తుల బదలాంపునకు సంబంధించి ఈ సాంకేతిక అవరోధాలతో బ్యాంకు రుణాలు తీసుకునే సందర్భంలో యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఆస్తి పన్ను మదింపు సమయంలో రెవెన్యూ డివిజన్లను బట్టి ఆస్తి పన్ను మొత్తం వేస్తారు. ఇందులో ఖరీదైన భవనాలు ఉన్న ప్రాంతాలు, వ్యాపార కేంద్రాలకు ఒక రకంగా, సాధారణ రెసిడెన్షియల్ ఏరియాలు, స్లమ్ ఏరియాలకు మరోకరకంగా పన్ను ఉంటుంది. ఇందులో జోన్ల వారీగా విభజిస్తారు. స్లమ్ ఏరియాలో జరిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు, కమర్షియల్ ఏరియాకు సంబంధించి ఇంటి నంబర్లు అలాట్ అవుతుండడంతో జనం నానాఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ఎన్నికల సమయంలో కూడా ఇంటి నంబర్ల ఆధారంగానే వార్డుల విభజన జరుగుతుంది. బూత్‌ల కేటాయింపులు కూడా అదేవిధంగా జరుగుతాయి. మ్యుటేషన్‌లో జరుగుతున్న లోటుపాట్లు, లోపాలకు కొనుగోలుదారులు చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయాలు మాత్రం మ్యుటేషన్‌కు తమకు పెద్దగా సంబంధం లేదనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఆటోమెటిక్‌గా బదలాయింపులు జరిగిపోతాయని, తమ జోక్యం ఉండదని పేర్కొంటున్నారు. తప్పులను సరిదిద్దడంలో ఇటు మున్సిపల్, అటు రిజిస్ట్రేషన్‌శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు.



రామగుండం కార్పొరేషన్‌లోని నివాస ప్రాంతాలు

● మున్సిపల్ లేఖకు స్పందించని రిజిస్ట్రేషన్‌శాఖ

మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో మ్యుటేషన్లకు సంబంధించిన ఇబ్బందులు, పొరపాట్లపై రామగుండం నగరపాలక సంస్థ సవివరంగా పెద్దపల్లిలోని రామగుండం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి లేఖ పంపింది. ఈ లేఖను అనుసరించి పొరపాట్లను సరిదిద్దాలని పేర్కొన్నది. అయినా కూడా రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్పందన లేదు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎఫ్‌బీ కార్యకర్తలు

సుభాష్‌నగర్, జూలై 1: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని చెబుతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని, ఈ విషయమై అధికారులకు విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం లేదన్నారు. తక్షణమే కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురువెల్లి శంకర్, ప్రశాంత్ కుమార్, బేక్కంటి రమేశ్, బద్రి, కార్మిక సంఘ నాయకులు అరుణ్, కళావతి, శారద, సరళ పాల్గొన్నారు.

నకిలీ ఏజెంట్లపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, జూలై 1: ముగ్గురు నకిలీ ఏజెంట్లపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన మొగిలి దేవదాస్ అతని స్నేహితుడైన కల్లెడ శ్రీకాంత్, చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన అడప రాజేష్ ఉపాధి నిమిత్తం వేరే దేశం వెళ్లేందుకు కరీంనగర్ పట్టణానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ ఇండో అరబ్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలీ, విలాసాగర్ తిరుపతి, రహీంలను కలిశారు. సదరు వ్యక్తులు వీసా ఇప్పిస్తానని నమ్మబలికి యూరప్ దేశం లిథువేనియా పంపిస్తానని వారి వద్ద నుంచి పది లక్షల ఇరవై వేల రూపాయలు వసూలు చేసి నకిలీ వీసాలు ఇచ్చారు. ఎయిర్ పోర్ట్‌కు వెళ్లిన బాధితులకు అక్కడ అధికారులు అవి నకిలీ విసాలు అని తేల్చి చెప్పడంతో ఏజెంట్లు తమను మోసం చేశారని న్యాయం చేసి తమ డబ్బులు ఇప్పించాలని కోరుతూ మొగిలి దేవదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహమ్మద్ అలీ, విలాసాగర్ తిరుపతి, రహీంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు-

జగిత్యాల టౌన్, జూలై 1: జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి త్రికూటాలయంలో 9వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి వారల కల్యాణ మహోత్సవ వేడుకలను వేద పండితులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై కల్యాణ వేడుకలను నిర్వహించగా మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతితో పాటు భక్తులు హాజరై ఒడి బియ్యం సమర్పించి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ట్రస్టు సభ్యులు ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చవద్దు

కరీంనగర్ టౌన్, జూలై1: ఆర్థికంగా ఎదిగిన ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏ జాబితాలో చేర్చవద్దని తెలంగాణ రజక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రజక సంఘం ఆధ్వర్యంలో బీసీ ఏ కులాల పరిరక్షణ సమితి జిల్లా సదస్సు జరిగింది. ఈసదస్సుకు ముఖ్యఅతిథిగా రజక సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ హాజరై మాట్లాడుతూ 2008లో బీసీ ఏలో చేర్చవద్దని కోరుతూ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు తప్పుబట్టడంతో ముదిరాజ్‌లు సుప్రీం కోర్టును ఆశ్రయించారని అన్నారు. సుప్రీం కోర్టు కూడా తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు ముత్యాల నర్సింహులు, వనపర్తి శంకర్, చాకలి అయిలమ్మ మనుమరాలు శ్వేత, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, కెవెల్ సుధాకర్, పైడి కొమురయ్య, వాల్మీకి ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఎన్.గోపాల్, లీగల్ అడ్వయిజర్ లింగంపల్లి నాగరాజు, నెమలి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన విశ్వవిద్యాలయంలో వన మహోత్సవం



ఎస్‌యూలో మొక్కలు నాటుతున్న రిజిస్ట్రార్

గణేశ్‌నగర్, జూలై 1: శాతవాహన విశ్వవిద్యాలయంలో వన మహోత్సవం కార్యక్రమంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.ఎన్.రావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, బిఎన్‌రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ బి.ఎన్.రావు పాల్గొన్నారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈ మనోహర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హరికాంత్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ పాల్గొని విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. అలాగే అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా బీయన్‌రావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కంచు తిరుపతి, అధ్యాపకులు డాక్టర్ మనోజ్ కుమార్, బండ నరేష్, డాక్టర్ బి పరుశురాములు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, జూలై 1: కరీంనగర్ బస్టాండ్ కాంప్లెక్స్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. రాత్రి 11 గంటల సమయంలో బ్యాంక్‌లో నుంచి దట్టమైన పొగలు బయటకు రావడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తన సిబ్బంది, ఫైర్ ఇంజన్‌తో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయినా మంటలు అదుపులోకి రాలేదు. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు.



బ్యాంకు షట్టర్లు తెరుస్తున్న పోలీసులు

సంక్షేమ హాస్టళ్లలో సీట్ల సంఖ్య పెంచాలి

గణేశ్‌నగర్, జూలై 1: జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టళ్లలో సీట్ల సంఖ్యను పెంచాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంద గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ హాస్టళ్లలో సరిపడా సీట్లు లేనందున అనేక మంది విద్యార్థులు ఇంటర్, ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా యంత్రాంగం స్పందించి విద్యార్థులకు సరిపడా భవనాలను ఏర్పాటు చేసి సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులను కలుపుకొని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కుమార్, తిరుపతి, మహేష్, గణేష్, నరేష్, నాతోపాటు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాటర్‌పోలో పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 1: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఈనెల 7నుంచి 11వ తేది వరకు జరిగే 50వ జూనియర్ జాతీయ స్థాయి వాటర్‌పోలో పోటీలకు జిల్లాకు చెందిన ఇరువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెల 23న సికింద్రాబాద్‌లో జరిగిన 9వ తెలంగాణ సబ్‌జూనియర్ అంతర్ జిల్లాలో స్విమ్మింగ్ పోటీల్లో విశేషప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు కంకణాల శ్రీధర్, హాశిక పటేల్‌లు విశేష ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్విమ్మింగ్ కోచ్ పి చంద్రశేఖర్ తెలిపారు. గతంలో కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో జరిగిన జాతీయపోటీల్లో శ్రీధర్ పాల్గొని ప్రతిభ చాటాడని పేర్కొన్నారు. క్రీడాకారులను జిల్లా యువజన శాఖ అధికారులు వి.శ్రీకాంత్ రెడ్డి, స్విమ్మింగ్ కోచ్ సంపత్‌కుమార్ తదితరులు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో

కుటుంబ కలహాలతో బాలిక ఆత్మహత్యాయత్నం

చందుర్తి, జూలై 1: కుటుంబ కలహాలతో ఓ బాలిక ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీవాణి (15) 9వ తరగతి చదువుతున్న బాలిక కుటుంబ కలహాలతో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం మొదట వేములవాడలోని ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఐదు సంవత్సరాల క్రితం బాలిక తండ్రి లచ్చయ్య మృతి చెందాడు. సంఘటనపై విచారణ జరుగుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తెరుచుకున్న బాబ్లీ గేట్లు

ఎస్సారెస్పీకి పెరగనున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రంలో గోదావరి నదిపై గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. సోమవారం బాబ్లీ ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారుల సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో గోదావరి నదిపై మహారాష్ట్ర సర్కారు నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం జూలై 1వ తేది నుంచి ఎత్తి నీటిని వదిలారు. నాలుగు నెలల పాటు ప్రాజెక్టు గేట్లు తెరుచుకొని ఉంచి వచ్చిన నీరును వచ్చినట్లుగానే దిగువలోకి వదలనుండడంతో రానున్న రోజుల్లో ఎస్సారెస్పీలోకి వరద నీరు వచ్చి చేరనుంది. అక్టోబర్ 28వ తేది వరకు గేట్లను ఎత్తి ఉంచనున్నారు. బాబ్లీ గేట్లు తెరుచుకునే పనులను పరిశీలించడానికి ఎస్సారెస్పీ అధికారుల బృందం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టును సందర్శించింది. అధికారుల బృందంలో సీడబ్ల్యూసీ ఈఈ వెంకటేశ్వర్లు, పోచంపాడ్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్త, ఈఈ చక్ర పాణి, సీడబ్ల్యూసీ ఎస్‌డీఈ సత్తీష్, నాందేడ్ బాబ్లీ ఈఈ బాన్సోడ్, పోచంపాడ్ ఏఈఈ వంశీ, పలువురు బాబ్లీ డ్యామ్, శ్రీరాం సాగర్ ప్రాజెక్టు అధికారులు తదితరులున్నారు.


ప్రాజెక్టును సందర్శించిన ఎస్సారెస్పీ అధికారులు


బాబ్లీ గేట్లు ఎత్తడంతో ఎస్సారెస్పీలోకి వస్తున్న వరద నీరు

స్కూల్‌కు వెళ్లేందుకు ఎలక్ట్రిక్ బైక్ ఇవ్వలేదని..
పురుగుల మందు తాగిన విద్యార్థి

చికిత్స పొందుతూ మృతి

కథలాపూర్, జూలై 14 : తాను ఎలక్ట్రిక్ బైక్‌పై స్కూల్ వెళ్తానని అడగడంతో తల్లి మందలించగా గడ్డి మందు తాగిన విద్యార్థి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన మండలంలోని పోసాని పేటలో జరిగింది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... మారు మణిదీప్ (14) ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదవుతున్నాడు. ప్రతీ రోజూ సైకిల్‌పై వెళ్లే మణిదీప్ గత నెల 26న ఇంట్లో ఉన్న ఎలక్ట్రిక్ బైక్‌పై వెళ్తానని తల్లిని అడగగా అందుకు తల్లి నిరాకరించింది. దీంతో మనస్థాపానికి గురైన మణిదీప్ గడ్డి మందు తాగాడు. దీంతో కడుపు నొప్పిగా ఉందని ఇంట్లో వారికి చెప్పడంతో పరిస్థితి గమనించి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ సోమవారం మణిదీప్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


మణిదీప్ (ఫైల్)

చొప్పదండిలో చోరీ

చొప్పదండి, జూలై 1: చొప్పదండి పట్టణంలో చోరీ జరిగింది. గుర్రం చంద్రకళ తన ఇంటికి తాళం వేసి నాలుగు రోజుల క్రితం తీర్థయాత్రలకు వెళ్లారు. సోమవారం వచ్చి చూసే సరికి ఇంటిలోని బీరువాలు తెరిచి ఉన్నాయి. అందులోని పద్నాలుగు తులాల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయల నగదుతో పాటు ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు.

రోడ్డు పక్కన షాపులు తొలగించిన సిబ్బంది

నిరసన తెలిపిన షాపుల నిర్వాహకులు


శంకరపట్నంలో నిరసన వ్యక్తం చేస్తున్న షాపుల నిర్వాహకులు

శంకరపట్నం, జూలై 1: మండలంలోని తాడికల్‌లో రోడ్డు అక్రమించి ఉన్న షాపులను గ్రామపంచాయతీ సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా తాడికల్‌లో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి స్థలంలో చిరు వ్యాపా రులు షాపులు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. రోడ్డును అనుకుని షాపులు ఏర్పాటు చేసుకోవడంతో తరుచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామపంచాయతీ సిబ్బంది నిర్వాహకులను పలుమార్లు హెచ్చరించినా షాపులు తొలగించలేదు. సోమవారం గ్రామపంచాయతీ సిబ్బంది రహదారి స్థలంలో ఉన్న షాపులను తొలగించారు. దీంతో షాపు నిర్వాహకులు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి నిరసనను విరమింపజేశారు. ఎంపీవో బషీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి సమ రాజేశ్వర్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, జూలై 1: బీసీ కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు కోరారు. గతంలో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోస్టులను బీసీ సంక్షేమ అధికారుల ద్వారా భర్తీ చేశారన్నారు. ఇప్పుడు కూడా అలాగే చేసి ప్రత్యేక బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీ కార్పొరేషన్‌ను యథావిధిగా కొనసాగించాలన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లి టౌన్, జూలై 1: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘనటన సోమవారం పెద్దపల్లిలో జరిగింది. ముత్తారం మండల కేంద్రానికి చెందిన ఆకుల మొగిలి (45) కొద్ది రోజులుగా మద్యం సేవిస్తూ ఇంట్లో తరుచు గొడవకు దిగేవాడు. ఇదే క్రమంలో మద్యం మత్తులో ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మొగిళి తన సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. సోమవారం కూనారం రైల్వేగేటు వద్ద తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడు మొగిళి భార్య ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసునమోదు చేసుకొని పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.


మొగిలి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్ , జూలై 1 : మండలంలోని కొత్తపల్లి నుంచి పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య చీకురాయి రైల్వే పట్టాలపై గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి. తిరుపతి తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పాటు బ్లూ కలర్ షర్టు, నలుపు రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఏమైనా వివరాలు తెలిస్తే 9949304574, 8712658604 నంబర్‌కి కాల్ చేయాలని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 1: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. చందనాపూర్ గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్సై సనత్‌కుమార్ సిబ్బందితో కలసి తనిఖీ చేయగా ఓ ఇంటి వద్ద అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,410 స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులపై ఎస్సై సనత్‌కుమార్ కేసు నమోదు చేశారు.

విద్యుత్ ప్రజావాణిలో సమస్యలు తక్షణమే పరిష్కారం

గణేశ్‌నగర్, జూలై 1: విద్యుత్ ప్రజావాణిలో వినియోగదారుల సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతాయని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. విద్యుత్తు వినియోగదారుల కోసం టీజీఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం ఆయన వినియోగదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ విద్యుత్తు ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ ఆఫీసు 3 దరఖాస్తులు, కరీంనగర్ టౌన్ 5 , కరీంనగర్ రూరల్ 2 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ విజయేందర్ రెడ్డి, ఏడీ స్వప్న, వీణ, తదితరులు పాల్గొన్నారు.

కోడెలు, ఆవులను ఉచితంగా పంపిణీ చేయాలి

● రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ● వేములవాడ గోవుల ఉచిత పంపిణీపై సమీక్ష


మాట్లాడుతున్న రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

సిరిసిల్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ గోశాల నుంచి అదనపు కోడెలు, అవులు, ఉచిత పంపిణీకి అర్హు లైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ అన్నా రు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో వేములవాడ దేవస్థానం గోవుల ఉచిత పంపిణీపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవస్థానానికి భక్తులు సమర్పించిన కోడెలు, ఆవులు అధికంగా పెరగ డం వల్ల అసక్తి గల అర్హులైన రైతులు ఆలయ గోశాలలు, ప్రైవేటు గోశాలలు, హిందూ మతాల వారికి అదనపు కోడెలు, అవులను ఉచితంగా పంపిణీ చేయడానికి దరఖాస్తులు అహ్వానిస్తున్నామన్నారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు రాని పక్షంలో రైతు సంఘాలు, సొసైటీలకు అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. వేములవాడ దేవస్థానం ఈవోకు దరఖాస్తు చేసుకోవాల ని అన్నారు. వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వంచే ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

వేములవాడ దేవస్థానానికి సంవత్సరానికి 2,500 కోడెలు భక్తులు సమర్పిస్తారని దేవాలయం వద్ద 450 నుంచి 500 వరకు కోడెలు నిల్వ ఉంచుకుని మిగిలినవి వివిధ గోశాలకు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. తిప్పాపురం గోశాలతో అదనపు షెడ్ల నిర్మాణం, సీసీ ఫ్లోరింగ్, డ్రైనేజీ నిర్మాణం, కోసం దేవాదాయ శాఖ రూ కోటి మంజూరు చేసిందని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అన్నారు. గోశాల నుంచి కోడెలు, ఆవులు పంపిణీ చేసిన తరువాత నిర్వహణ పకడ్బందీగా ఉండాలని జిల్లాలో అధికారులు అకస్మికంగా తనిఖీలు చేస్తారని తెలిపారు. పంపిణీ చేసే ప్రతి కోడె, అవులకు వైద్య పరీక్షలు నిర్వహించి అరోగ్య రిపోర్టులు లబ్ధిదారుడికి, దేవస్థానం, పశు సంవర్ధక శాఖ వద్ద ఉండాలని అన్నారు. పంపిణీ చేసిన పశువులను కూడా పశు సంవర్ధక శాఖ వైద్యులు పరిశీలించడం జరుగు తుందని కోడెలు, అవుల పట్ల నిర్లక్ష్యం వహించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో రాజేశ్వర్, ఈవో వినోద్‌రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కొమురయ్య ఉన్నారు.

యమ ధర్మరాజు ఆలయంలో అభిషేకం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, జూలై 1: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ యమ ధర్మరాజు ఆలయంలో సోమవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమ సూక్త పూర్వక అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అపమృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కరీంనగర్ క్రై, జూలై 1: మానకొండూర్ సమీపంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కరీంనగర్ టూ టౌన్ పోలీస్‌లు కొత్తగా అమల్లో వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ప్రకారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూ టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన శివరాత్రి కొమురయ్య తన ట్రాక్టర్ ద్వారా మానేరు వాగు నుంచి కరీంనగర్‌లోని ముకరంపురకు తరలిస్తున్న క్రమంలో టూ టౌన్ పోలీస్‌లు తెలంగాణ చౌక్ వద్ద పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కొత్త చట్టం బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా సోమవారం నుంచి కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. కొత్త చట్టం ప్రకారం కమిషనరేట్ వ్యాప్తంగా సోమవారం పదికిపైగా కేసులు నమోదయినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

స్కానింగ్ సెంటర్లలో దోపిడీని అరికట్టాలి

సుభాష్‌నగర్, జూలై 1: జిల్లా కేంద్రంలోన ఉన్న డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లు వసూలు చేస్తున్న అధిక ఫీజులను తగ్గించి దోపిడీని అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లిఅ యుగేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆర్ఎంపీ, పీఎంపీలతో పేరుతో పేషంట్ల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరైన వసతులు, పార్కింగ్ స్థలం, మంచినీటి సౌకర్యం, విశాలమైన గదులు వంటి సౌకర్యాలు కల్పించకుండా అధిక ఫీసులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

లోవోల్టేజీతో విద్యుత్ పరికరాలు దగ్ధం

మల్యాల, జూలై 1: మల్యాల బీసీ కాలనీలో ఆదివారం రాత్రి లోవోల్టేజీతో విద్యుత్ పరికరాలు దగ్ధం అయ్యాయి. కాలనీకి చెందిన పలువురి ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, విద్యుత్ లైట్లు తదితరవి కాలిపోయాయి. లోవోల్టేజీ సమస్య తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించారు.

పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


కుంకమ పూజలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి, జూలై, 1: పట్టణంలోని బంగారు పెద్దమ్మ తల్లి ఆలయం 14వ వార్షికోత్సలు ఘనంగా జరిగాయి. సోమవారం బంగారు పెద్దమ్మతల్లి ఆభరణాలను వీధుల గుండా ఎదుర్కోలుగా ఆలయానికి కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు భక్తులతో కలిసి నెత్తిన ఎత్తుకొని తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలోని అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తు లకు పంచామృతాలతో అభిషేకాలు చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం లో హోమం, కుంకుమ పూజలు జరిపించారు. అనంతరం భక్తులు ఆలయ సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని గోమాతలకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయవలన వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సార్గం వాడకట్టు సంఘం అధ్యక్షుడు జక్కం బాబు, మఠంవాడ సంఘం అధ్యక్షుడు యామ గణేష్, జక్కం రమేష్, పోచమ్మవాడ సంఘం అధ్యక్షుడు నేమూరి బాలకృష్ణ, జిట్టవేణి నర్సయ్య, రంజిత్, లక్ష్మయ్య, రాజయ్య, సంఘం సభ్యులు, నాయకులు, భక్తులు, పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సుభాష్‌నగర్, జూలై 1: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏడు వేల కోట్లకుపైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరి మామిడిపల్లి హేమంత్, కసిరెడ్డి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

సుభాష్‌నగర్, జూలై 1: కురుమ కులస్తులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కురుమ సంఘం జిల్లా మహిళ అధ్యక్షురాలు కర్రె పావని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కురుమలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గం నుంచి బీర్ల ఐలయ్య ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు. రాష్ట్రంలో 50 లక్షల కురుమ జనాబాకు ప్రతినిధిగా ఉన్న బీర్ల ఐలయ్యకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షురాలు పెద్ది అనిత, పుల్ల రమ్య, సంద అంజలి, మేకల దేవిక, కర్రె సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను కూల్చేందుకు అధికారుల యత్నం

అడ్డుకున్న నిర్మాణదారులు

కరీంనగర్ రూరల్, జూలై1: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలో సర్వేనెంబర్ 471 పోచమ్మకుంట గుట్ట ప్రాంతం లో అక్రమ కట్టడాలను కూల్చేం దుకు ఆదివారం రెవెన్యూ అధికారు లు యత్నించగా ఇద్దరు అడ్డుకున్నా రు. కొన్నేళ్లుగా ప్రభుత్వ స్థలంలో కొన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ సర్వే నెంబర్‌లో వేముండ్ల వెంక టేష్ ఇటీవల ప్రహరీ నిర్మిస్తుండగా గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల కిందట ప్రహరీ కూల్చేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను వారు అడ్డుకున్నారు. సోమవారం ఆర్ఐ రజనీకాంత్ మోకాపై వెళ్లి పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన ప్రహరీని ఎక్స్‌కావేటర్‌తో కూల్చి వేసేందుకు ప్రయత్నించగా వెంకటేష్ పురుగుల మందు డబ్బాతో వచ్చి అడ్డుకున్నాడు.

అలాగే మరో వ్యక్తి దుస్స అంజనేయులు ఎక్స్‌కావేటర్‌ని అడ్డగించి తమ ఇళ్లను కూల్చవద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ స్థలంలోనే 20 నుంచి 30 సంవత్సరాలుగా ఆధీనంలో ఉంచుకున్నామని, గొర్రెల మందలను ఏర్పాటు చేసుకున్నామని వెంకటేష్ తెలిపాడు. కొందరు ఇళ్ల నిర్మాణం చేసుకున్నారని వాటికి కరెంటు మీటర్లు, నల్లలు ఏర్పాటు చేసినప్పటికి గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఓ ప్రజాప్రతినిధి అండతో అక్రమ నిర్మాణాలు జరిపితే పట్టించుకోలేని అధికారులు తమ విషయంలో అభ్యంతరం వ్యక్తం చేయడమేంటని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న అక్రమ నిర్మాణాలన్ని తొలగించి తను నిర్మించిన ప్రహరీని కూల్చాలంటూ పురుగులమందు డబ్బాతో ఒకరు, జేసీపీని అడ్డుకుని మరొకరు వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. చివరకు ప్రహరీ కూల్చివేత కార్యక్రమాన్ని నిలిపివేశారు. స్వచ్ఛందంగా ప్రహరీ తొలగించకుంటే వెంకటేష్‌పై చర్యలు తీసుకుంటామని ఆర్ఐ రజనీకాంత్ హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలు జరిపితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.


పనులను అడ్డుకొని నిరసన తెలుపుతున్న దుస్స ఆంజనేయులు

మద్దతు పలికిన బీజేపీ మండల అధ్యక్షుడు

అక్రమ నిర్మాణాల తొలగింపు విషయంలో బీజేపీ మండల అధ్యక్షుడు అభ్యంతరం వ్యక్తం చేశాడు. గుట్టకు అనుకుని ఉన్న భూములు బండరాళ్ళతో నిరుపయోగంగా ఉండేదని ఇల్లులేని పేదలు కొందరు భూమిని చదను చేసుకున్నారని, మరి కొందరు పశువులకు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా కబ్జాలో ఉన్న వారికి పట్టాలు, నివేశస్థలాలకు ప్రొసీడింగ్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలోనే వారు 58,59జీవో దరఖాస్తు చేసుకున్నారన్నారు. తహసీల్దార్ వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం, జూలై 1: ప్రవర్తన సరిగా లేదని మార్చుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కరీంపేటకు చెందిన గుర్రం సాయిరాం (21) ప్రవర్తన బాగోలేదని, మార్చుకోవాలని తల్లిదండ్రులు గుర్రం భాగ్యలక్ష్మి- నాగరాజు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సాయిరాం సోమవారం తెల్లవారుజామున ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. సాయిరాం తండ్రి గుర్రం నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.


సాయిరాం (ఫైల్)

వేములవాడలో ఒకరి ఆత్మహత్య

వేములవాడ టౌన్, జూలై 1: వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయ పరిసరాల్లో సోమవారం ఓ వ్యక్తి కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన గూడూరి విష్ణు (36) అనే వ్యక్తి రాజన్న ఆలయ పరిసరాల్లో స్పృహ కోల్పోయి పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు గతంలో నేత కార్మికుడగా, ఆటో డ్రైవర్‌గా పనిచేసి ప్రస్తుతం ఖాళీగానే వుంటున్నాడని తెలిపారు. భార్యతో విడాకులు చేసుకుని ఒంటరి జీవితాన్ని గడుపుతున్నట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.


గూడూరి విష్ణు (ఫైల్)

రంగపేట పాఠశాలలో చోరీ

సారంగాపూర్, జూలై, 1 : మండలంలోని రంగపేట జడ్పీహెచ్ పాఠశాలలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. హైస్కూల్, ప్రైమరీ, అంగన్‌వాడీ సెంటర్ ఒకే చోట నిర్వహించబడుతాయి. ఆదివారం రాత్రి దుండగులు చొరబడి అంగన్‌వాడీ సెంటర్ తలుపులు పగులగొట్టి కోడిగుడ్లను ధ్వంసం చేపడంతో పాటు, పాఠశాలలో ఉన్న హైమాస్ట్ లైట్లను ఎత్తుకెళ్లారు. స్థానికులు, ఉపాధ్యాయుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

పెద్దపల్లి రూరల్, జూలై 1: వానాకాలంలో నిర్వహించే వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వన మహోత్సవ కార్యక్రమానికి కావాల్సిన మొక్కలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీవో సుదర్శన్, ఏపీవో రమేష్ బాబు, ఈజీఎస్ జేఈ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం

గోదావరిఖని, జూలై 1: ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎస్ అండ్ పీసీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తూ పదవి విరమణ పొందుతున్న సెక్యూరిటీ గార్డ్ బొల్లం రాజమణిని సోమవారం ఆర్జీ-1 జీఎం కార్యలయం ఎస్‌అండ్‌పీసీ డిస్ట్రిబ్యూషన్‌లో సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి ఆధ్వర్యంలో తోటి ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. జ్ఞాపికను అందజేసి రాజమణి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొందారని తెలిపారు. పదవీ విరమణ అనేది అనివార్యమని, ప్రతిఒక్కరూ పదవీవిరమణ పొందుతారన్నారు.

వారి భావిజీవితం సుఖ శాంతులతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేష్, చంద శ్రీనివాస్, అక్బర్ అలీ, భాస్కర్, పిల్లి కుమారస్వామి, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ శ్రీరెడ్డి వెంకటస్వామి, సెక్యూరిటీ సిబ్బంది, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామగుండం నగరానికి మంచి రోజులు

- గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి - ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ, జూలై 1: రామగుండం నగరానికి మంచి రోజులు వచ్చాయని స్థానిక శాసన సభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. సోమవారం రామగుండం నగర పాలక సంస్థ మేయర్ బంగి అనిల్ కుమార్, వివిధ విభాగాల అధికారులతో కలసి 38వ డివిజన్ ఇందిరానగర్, సంజయ్ గాంధీనగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నగర అభివృద్ధి కోసం రూ.100కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామన్నారు. మరో 20కోట్ల రూపాయల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. నగరంలో వసతుల కల్పనలో సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ తదితర పరిశ్రమలను భాగస్వాములను చేసి ఆయా సంస్థల సీఎస్ఆర్ నిధులతో కూడా అభివృద్ధి పనులను చేపడామన్నారు. త్వరలో ఇంటి నిర్మాణం కోసం స్థలం ఉన్న పేద వారికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తామన్నారు. ఇంటి యాజమనులు చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. యాజమనులు తమ ఖాళీ స్థలంలో పెరిగిన పొదలు, తుప్పలు, పిచ్చి చెట్లను వెంటనే తొలగించుకోవాలని కోరారు. రోడ్డుకు అడ్డంగా పెరిగిన కొమ్మలు, చెట్లను తొలగించి రహదారులు విశాలంగా ఉండేటట్లు చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వరదనీరు ఇంట్లోకి రాకుండా కాలువలన్నీ సాఫీగా ప్రవహించేటట్లు పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. పెద్ద కాలువను ఆర్‌ఎఫ్‌సీఎల్ సంస్థ నిర్మించాలని ఆదేశించారు. సంజయ్ గాంధీనగర్ రైల్వే ట్రాక్ సమీపంలో అప్రోచ్ రోడ్డు నిర్మించాలని, పార్కు ఏర్పాటు చేయాలని ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులను ఆదేశించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ సంస్థల సహకారంతో ఇందిరానగర్ చౌరస్తా నుంచి గౌతమినగర్ చౌరస్తా వరకు డివైడర్ నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దశల వారీగా అన్ని వీధుల్లోనూ రోడ్లు నిర్మించాలని ఆదేశించారు. ఇందిరానగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న బోర్‌వెల్ తొలగించి పక్కకు మరొకటి ఏర్పాటు చేయాలని అన్నారు. డివిజన్‌లో అవసరమైన చోట్ల కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి వీధిదీపాలు అమర్చాలని ఆదేశించారు. ఆ తరువాత సంజయ్ గాంధీనగర్ ఆటో స్టాండ్ వద్ద ఏర్పాటు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

చేసిన వేదిక వద్ద ఆయా సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజల, డివిజన్ నాయకుల, స్థానిక కార్పొరేటర్ దృష్టికి తెచ్చిన సమస్యలపై స్పందించి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. కాగా బస్సులో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులతో కరచాలనం చేసి ఎమ్మెల్యే వారిని ఉత్సాహపరిచారు. శాంతినగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోనికి వెళ్లి విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీచైతన్య పాఠశాల ప్రహరీ ఎదురుగా ఖాళీ స్థలంలో మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జంగపల్లి సరోజన, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, ముస్తఫా నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, ఈఈ రామన్, రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాభాయ్, ఆర్‌ఎఫ్‌సీఎల్ మేనేజర్ మయాంక్ ధావన్, ఎన్‌టీపీసీ అధికారి చంద్ర, ట్రాన్స్‌కో ఏఈ జహంగీర్, మాజీ మేయర్ జాలి రాజమణి, నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, ధీటి బాలరాజు, విశ్వతేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ లతో కలిసి పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇచ్చి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ధరణి భూ సమస్యలకు సంబంధించి ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ స్వీకరిస్తూ సదరు దరఖాస్తు ప్రస్తుత స్థితిగతులను ఆన్‌లైన్‌లో పరిశీలించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. పెద్దపల్లి మండలం చందపల్లి గ్రామానికి చెందిన రంగు సతీష్ కుమార్ తమ వ్యవసాయ భూమికి ఎస్సారెస్పీ డి 83 కెనాల్ ద్వారా పిడుగు బండల దగ్గర వచ్చే చిన్న నీటి కాలువను పూడ్చి వేశారని, దీని వల్ల తన పొలంతో పాటు మరో 10 ఎకరాల భూమికి సాగునీరు అందడం లేదని, ఈ కాలువను మళ్ళీ తీయించి తమ పొలాలకు నీళ్ల అందించాలని కోరారు. పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారికి రాస్తూ వెంటనే అవసరమైన చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. మంథని మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన ఎండీ రియాజ్ అక్కెపల్లి ఆర్జీ 3 భూ సేకరణ కింద గ్రామ శివారులోని 564 ప్రాజెక్టు నంబర్‌కు తనకు మొదటి పేమెంట్ వచ్చిందని గెజిట్ ఆర్‌అండ్‌ఆర్‌లో పేరు తప్పుగా నమోదు అయిందని దానికి సరిచేసి రెండో పేమెంట్ వచ్చే విధంగా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. మంథని రెవెన్యూ డివిజన్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన హనుమల కమలమ్మ తన భర్త మధునయ్య మరణించారని, తన భర్తకు అప్పన్నపేట గ్రామంలోని సర్వే నంబర్ 705లో 14 గుంటల భూమి ఉన్నదని, తన ఇద్దరు కుమారులు 14 గుంటల భూమికి పట్టా చేసుకున్నారని, అప్పటి నుంచి నాకు తిండి, నివాసం కల్పించడం లేదని, తన భర్త యొక్క భూమిని తన పేరుపై మార్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ డివిజన్ అధికారికి రాస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన సుద్దాల సతీష్‌గౌడ్ సబ్బితం గ్రామ పంచాయతీకి చెందిన పంచాయతీ కార్యదర్శి విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తున్న నేపథ్యంలో అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేశారు. జిల్లా పంచాయతీ అధికారికి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల ద్వారా సాగుకు చర్యలు

- ఎరవులు, రసాయనాలు డ్రోన్‌ల ద్వారా పిచికారి
- జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి

సుల్తానాబాద్, జూలై 1: వ్యవసాయ సాగులో అదునిక సాంకేతికతను ఆసరాగా చేసుకుని రైతులకు వాటిని అందుబాటులోకి తెస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండంలోని చిన్నకలువల సహకార సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం సోమవారం సంఘం అవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎరువులు రసాయనాలు పిచికారీ చేసేందుకు కొన్ని చోట్ల ఆధునిక పద్ధతులను అవలంభిస్తున్నారని వాటిని తమ సంఘం పరిధిలోని రైతులకు కూడా వర్తింపచేయాలని సూచించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవం సాధించిన పలు దేశాలను అదర్శంగా తీసుకుని తాము కూడా రైతులకు వాటిని పరిచయం చేస్తున్నామని జిల్లా వ్యవసాధికారి అన్నారు. డ్రోన్‌ల ద్వారా ఎరువుల లిక్విడ్, రసాయనాలు పిచికారి చేయడానికి గాను పెద్దపల్లి జిల్లాలో ప్రయోగాత్మకంగా వాటి సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. జిల్లాలోని బంసత్ నగర్, పాలకుర్తి తదితర ప్రాంతాల్లో రెండు సర్వీసింగ్ సెంటర్లను కూడా ఎంపిక చేశామని, సహకార శాఖలోని పలువురికి ఇందులో తగిన శిక్షణ ఇచ్చి డ్రోన్‌ల ద్వారా రైతులకు సేవలందిస్తామన్నారు. కేడీసీసీ డైరక్టర్ దేవరనేని మోహన్ రావు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి సాంకేతిక పద్ధతులు, సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతుభరోసా పథకం కోసం రైతుల నుంచి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు. చాలా మంది రైతులు ఐదు లేదా పదెకరాలు ఉన్న వారికి మాత్రమే పథకం వర్తింపజేయాలన్నారు. అలాగే కౌలు రైతులకు కూడా భరోసా ప్రయోజనం చేకూరేవిధంగా ఉండాలని అకాంక్షించారు. సమావేశంలో సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్ కుమార్, సీఈవో వల్లంకొండ రమేష్, ఏఈవో రాజ్‌కుమార్ ఉన్నారు.

● రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ.

పెద్దపల్లి రూరల్: మండలంలోని అప్పన్నపేట ప్రాథమిక వ్యవసాయ సంఘం కార్యాలయంలో సోమవారం రైతు భరోసా పథకంపై సింగిల్‌విండో చైర్మన్ చింతపండు సంపత్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి సహకార సంఘం అధికారి రామానుజచార్యులు హాజరై రైతులు, సింగిల్ విండో డైరెక్టర్‌ల నుంచి అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో సీఈవో తిరుపతితో పాటు రైతులు, సింగిల్ విండో డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రాజేంద్రనగర్‌లో గల రైతు వేదికలో పీఏసీఎస్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతు భరోసాపై సోమవారం అభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వ్యవసాయ అధికారులు రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి

ఐదు నుంచి పదెకరాల వ్యవసాయ భూమి కలిగి ఉండి, ఐటీతో సంబంధం లేకుండా సాగు చేసే రైతులకు మాత్రమే రైతుబంధు వర్తింపజేయాలని రైతులు కోరారు. పంట సాగు చేయని భూములకు రైతు భరోసా పథకం వర్తింపజేయవద్దని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, ఆడిటర్ మఫాసిర్, పీఏసీఎస్ చైర్మన్ భాస్కరరావు, మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్లు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలి



ఎరువుల షాపులో రిజిష్టర్లు తనిఖీ చేస్తున్న ఏవో

ఎలిగేడు, జూలై 1: ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎరువుల షాపుల నిర్వాహకులు ఎరువులు, నాణ్యమైన వంగడాలను రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి తెలిపారు. మండలంలోని పలు ఎరువుల షాపులను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్లు, బిల్లు బుక్స్ ఇతరత్ర శాంపిల్స్ పరిశీలించారు. ఈపాస్ మిషన్ తోనే ఎరువులను విక్రయించాలని సూచించారు. రైతులు సైతం ఆలోచించి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి తక్కువ పెట్టుబడి పెట్టి అధిక లాభాలు పొందాలని ఉమాపతి కోరారు.

కనిపించే దేవుళ్లు వైద్యులు: ఎమ్మెల్యే

కోల్‌సిటీ, జూలై 1: కనిపించే దేవుళ్లు డాక్టర్లు అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో సోమవారం జరిగిన డాక్టర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యులు దేవునితో సమానమని, ఎళ్లప్పుడూ వైద్యం అందించేది వైద్యులేనన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, ఆర్థో ప్రొఫెసర్ రాజు, ఏఓ ఫక్రుద్దీన్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

● లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం..

అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పీ మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, కోశాధికారి పాకాల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నేత్ర వైద్యులు నిరంజన్, సమరదాస్ గుప్తా, కిరణ్‌రాజ్‌కుమార్, హిమబిందు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు కంజాపురం రాజేందర్, సత్యనారాయణ, గంగాధర్, తానిపర్తి గోపాల్‌రావు, తిలక్‌చక్రవర్తి, బంక రామస్వామి, గుండా రాజు, లక్కం బిక్షపతి, తానిపర్తి విజయలక్ష్మి, శశికళ, మనిషా పాల్గొన్నారు.

● హర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే సందర్భంగా సింగరేణి మెడికల్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బూడిద హర్ష, ప్రిన్సిపాల్ హిమబిందును, ఆర్థో హెచ్‌ఓడీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌ను ఘనంగా సన్మానించారు.

సుల్తానాబాద్: నేషనల్ డాక్టర్స్ డే ను పురస్కరించుకుని సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవితో పాటు డాక్టర్లు శ్రీధర్, రాంమోహన్, తనూజ, వెంకటేశ్, రాజు తదితరుల సేవలను ప్రస్తావిస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నీలయ్య, క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్, జిల్లా కో



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఆర్డినేటర్స్ శ్రీనివాస్, వెంకటేశం, సాంబమూర్తి, పల్లా అనిల్ కుమార్, పల్లా శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: డాక్టర్ డేను పురస్కరించుకొని స్థానిక వైద్యురాలు శరణ్యను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సత్కరించారు. వైద్యరంగంతో పాటు సేవారంగాల్లో శరణ్య విశేష సేవలు అందిస్తున్నారని లయన్స్‌క్లబ్ నాయకు లు ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సెక్రటరీ కేశవరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వెము కనకయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు కళాధర్‌రెడ్డి, సురేష్, దొడ్ల శ్రీనివాస్, ముధుకర్‌రెడ్డి, సత్యరెడ్డి, రాధయ్య పాల్గొన్నారు.

కమాన్‌పూర్: డాక్టర్స్ డే సందార్భంగా లయన్స్ క్లబ్ అధ్వర్యంలో మండల కేంద్రంలో విజయ నర్సింగ్ హోం డాక్టర్ విజయ్ కూమార్ దంపతులను శాలువా కప్పి మెమంటో అందజేశారు. కార్యక్రమంలో కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, డైరెక్టర్స్ పాల్గొన్నారు.

నవ్వుకు దూరమైతే అనారోగ్యం

ఓదెల, జూలై 1: నవ్వడం ఒక అదృష్టం అని అధికారం, డబ్బు ఎంత ఉన్నా నవ్వుకు దూరమైతే ప్రతి వ్యక్తికి అనారోగ్యం వెంటాడుతుందని ప్రముఖ హాస్య నటుడు రాదండి సదానందం(ఆర్‌ఎస్ నంద) అన్నారు. మండల కేంద్రానికి చెందిన భావకవి బ్రాహ్మండ్లపల్లి రవీంద్ర చారికి కరీంనగర్ ఫిలిం ఛాంబర్‌లో ఆదివారం రాత్రి పీవీ నరసింహారావు స్మారక పురస్కారం కింద, సినీ హాస్యనటుడు ఆర్‌ఎస్ నంద, విశ్వకళ విరాట్ బ్రహ్మ వంగల ప్రశాంత్ కృష్ణ ఆచార్యులు కలిసి మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ నంద మాట్లాడుతూ, ప్రతిఒక్కరు సంపాదనలో పడి ఆరోగ్యకర మైన నవ్వుకు దూరమవుతున్నారన్నారు. ప్రతిరోజు 10 నిమిషాలు నవ్వితే జీవనాడుల్లో కదలికలు ఏర్పడి చురుకుగా ఉంటారని అలాగే నవ్వుకుంటూ ముచ్చటిస్తే మానసిక అభివృద్ధి చెందుతుందని అన్నారు.

ప్రైవేట్ పాఠశాలల తనిఖీ

రామగిరి, జూలై 1: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులతో పాటు పాఠశాల పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొన్నాయనే వచ్చిన పలు ఫిర్యాదుల మేరకు సోమవారం ఇన్‌చార్జి మండల విద్యాధికారి సురేందర్ తనిఖీ చేపట్టారు. మండలంలోని ప్రైవేట్ పాఠశాలలైన హిల్‌ఫోర్ట్, కృష్ణవేణి, వాణి పాఠశాలలను సందర్శించారు. పాఠశాలలో గదులను, టాయిలెట్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంఈవో సురేందర్ మాట్లాడుతూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలకు సంబందించిన అంశాలను ఉన్నతాధికా రులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

సుల్తానాబాద్, జూలై 1: సుల్తానాబాద్ పట్టణంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవ ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ 15 వార్షికోత్సవ పూజలు సోమవారం ఉదయం వేద పండితులు ఉప్పరమల్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. పలు ప్రారంభ పూజల అనంతరం స్వామివారికి విశేష ఫలములతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే విజయరమణారావుతో పాటు మంచిర్యాల డిప్యూటీ కలెక్టర్ ఉమారాణి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వందలాది మంది భక్తులతో స్వామి వారి రథోత్సవం కన్నుల పండుగగా పట్టణ వీధుల్లో ఊరేగించారు. మహిళల కోలాటాలతో వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. కాగా ఎమ్మెల్యే, డిప్యూటీ కలెక్టర్‌ను ఆలయ కమిటీ వారు సన్మానించగా ఆర్చకులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు నగునూరి అశోక్, రాంరెడ్డి, పల్లా మురళీధర్, మాదూరి ప్రసాద్, మారుతి, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, జూలూరి అశోక్, సంజీవ్, వైకుంఠం, సాయిరి మహేందర్, కల్లెపల్లి జానీ, దామోదర్‌రావు, అబ్బయ్యగౌడ్, ఆవుల శివ, రాజయ్య, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పెద్దపల్లిటౌన్, జూలై 1: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కోయ శ్రీహర్షకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్, ఏఐఎస్ఎఫ్, జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఏడువేల కోట్లరూపాయల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. తమ కోర్సు పూర్తిచేసిన కూడా వారి సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యాలు ఇవ్వడం లేదని ,ఉన్నత చదువులకు, ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న వారికి ఇబ్బందికరంగా మారిందన్నారు. సకాలంలో స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తే విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ స్టాలిన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయి ఆజాద్, ఏఐఎస్ఎఫ్ పెద్దపెల్లి జిల్లా ఉపాధ్యక్షుడు మొలుగూరి సోను, సహాయ కార్యదర్శి కనుకుంట్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.



జూన్ నెల ఆర్జీ-2 ఏరియా ఉత్పత్తి 155 శాతం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 1: గడిచిన జూన్ నెలలో ఆర్జీ-2 ఏరియా 155 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాకు 4.85 లక్షల బొగ్గు ఉత్పత్తి టార్గెట్‌కు గాను 7.53 లక్షల ఉత్పత్తి జరిగినట్టు జీఎం తెలిపారు. ఓసీపీ-3 ప్రాజెక్టు లక్ష్యం 4.55 లక్షలు కాగా 7.16 లక్షలు (158 శాతం) ఉత్పత్తి జరిగినట్టు జీఎం తెలిపారు. వకీల్‌పల్లె గని 30,000 టన్నుల లక్ష్యానికి 36,736 టన్నుల ఉత్పత్తితో 122 శాతం సాధించినట్టు సూర్యనారాయణ పేర్కొన్నారు. గత ఏడాది మొదటి ఆరునెలలతో పోల్చుకుంటే ఈఏడాది 2.17 లక్షలు అధికంగా బొగ్గు ఉత్పత్తి జరగడమే కాకుండా మూడు లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్టు జీఎం తెలిపారు. సమావేశంలో అధికారులు మధుసూ దన్, రాజేంద్రప్రసాద్, ఎర్రన్న, ధనుంజయ, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, డా. మహిపాల్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆర్జీ-3లో 96 శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి, జూలై 01: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలో జూన్ నెలలో 96 శాతం ఉత్పత్తిని సాధించినట్లు ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు సోమవారం వెల్లడించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్జీ-3 ఏరియాకు నిర్ధేశించిన 5.28 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 5.09 లక్షల టన్నులు సాధించి 96 శాతం నిలిచిందన్నారు. బొగ్గు ఉత్పత్తితోపాటు నిర్ధేశించిన 38.70 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి వెలికితీత లక్ష్యానికి గాను 37.32 శాతం లక్షల క్యూబిక్ మీటర్లు సాధించినట్లు తెలిపారు. ఎన్‌టిపిసికి 7.14 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఆడ్రియాల ప్రాజెక్టుకు నిర్దేశించిన 0.18 లక్షల టన్నుల లక్ష్యానికిగాను 0.65 లక్షలు టన్నులు సాధించి 365 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు 0.63 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామని తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి, జూలై 01: సింగరేణి కల్పిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-1 రెమెడియేషన్ ప్లాన్ కింద కంప్యూటర్ డీటీపీ పీజీడీసీఏ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని జూలపల్లి, ముల్కలపల్లి, పన్నూరు, నాగేపల్లి, రత్నాపూర్ గ్రామాలకు చెందిన ఆసక్తి గల నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదోతరగతి అర్హత గల యువతి, యువకులు ఈ నెల 15న నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, పదోతరగతి సర్టిఫికెట్ జత చేసి జీఎం కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9949156171, లేదా 9989888001 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కోల్‌బెల్ట్ బంద్‌కు మావోయిస్టుల మద్దతు

● బొగ్గు బ్లాకులను సాధించే వరకు పోరాడండి ● మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని, జూలై 1: సింగరేణి పరిధిలోని సత్తుపల్లి, కోయగూడెం, కేకే6, శ్రావణపల్లి గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ జూలై 5వ తేదిన తలపెట్టిన కోల్‌బెల్ట్ బంద్‌ను విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మీడియాకు పంపిన ప్రకటనలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకుల పద్ధతులను, నిర్ణయాలను ప్రభాత్ ఆ ప్రకటనలో తప్పుబట్టారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు బంద్ పిలుపునిచ్చే ముందు సభ్య సంఘాలను, విప్లవ ట్రేడ్ యూనియన్లను, క్రాప్టు సంఘాలను సంప్రదించకుండా, ఐక్య ఉద్యమాల ఆలోచన లేకుండా ఏకపక్షంగా పోరాట షెడ్యూల్ ప్రకటించడం సమర్థనీయం కాదని ప్రభాత్ పేర్కొన్నారు.

సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐటీయూసీ తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మక తప్పిదంగా ప్రభాత్ అభివర్ణించారు. కార్మిక సంఘాల అనైక్యత, పెట్టుబడిదారులకు కొమ్ముకాసే నల్ల చట్టాలతో ప్రజల జీవించే హక్కును హరిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ఇదే బలం అనే వాస్తవాన్ని ఏఐటీయూసీ నాయకత్వం మరిచిందని ప్రభాత్ పేర్కొన్నారు. ఇప్పటికైనా ఏఐటీయూసీ నాయకులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని, అన్నివర్గాలను కలుపుకొని సింగరేణి పరిరక్షణ, కార్మిక హక్కుల రక్షణ కోసం మడమతిప్పని పోరాటాలకు సిద్ధం కావాలని ప్రభాత్ ఏఐటీయూసీకి సూచించాడు. ఈ బొగ్గు బ్లాకులను సింగరేణికి రిజర్వేషన్ పద్ధతిలో కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వరంగ సంస్థల్ని నిర్వీర్యం చేసే కుట్రలోనే కేంద్ర ప్రభుత్వం బహిరంగ వేలానికి పెట్టిందని ప్రభాత్ ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్‌ఎస్ పాలకులపై నెపంనెడుతూ తప్పించుకోవడానికి చేసే ప్రయత్నాలు అనైతికమని ఆయన అన్నారు. బొగ్గు బ్లాకు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించకుంటే బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

భారత్ జోడో యాత్రలో రాజీవ్ గాంధీ కూడా ప్రభుత్వరంగ సంస్థల్ని కాపాడుతామని చెప్పాడని, ప్రస్తుతం పార్లమెంట్ ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ విషయంలో స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రావణపల్లి, కేకే6లను సింగరేణిక అప్పగించే బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, సత్తుపల్లి, కోయగూడెం ఓసీపీలను కూడా అండర్ గ్రౌండ్ గనులుగా మార్చాలని ప్రభాత్ ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ బొగ్గు గనుల వల్ల నష్టపోయిన భూనిర్వాసితులకు ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, నిర్వాసితులకు సంస్థలో పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. భూ సేకరణ విషయంలో రెవెన్యూ అధికారులు కోల్‌బెల్ట్ ప్రాంత రైతాంగానికి నష్టం కలిగించే విధంగా వ్యవహరించారని, ఇప్పటికైనా మార్కెట్ రేట్లు సరిగ్గా నిర్ధారించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రెవెన్యూ అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరిక చేశారు.

నల్ల బ్యాడ్జీలతో టీబీజీకేఎస్ నిరసన

గోదావరిఖని, జూలై 1: సింగరేణి సంస్థను కాపాడుకుం దాం బొగ్గు బ్లాకుల వేలానికి వ్యతిరేకంగా పోరాడుదాం అంటూ టీబీజీకేఎస్ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం ఆర్జీ-1లో కార్మికులు నల్ల బ్యాడ్జీల ధరించి నిరసనను వ్యక్తం చేశారు. ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో మినిస్టీరియల్ స్టాఫ్ ఉద్యోగులను ఉద్దేశించి టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు సింగరేణి సంస్థను బొంద పెట్టడానికి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. జీడీకే 1, 2, 2ఏ, 11 ఇంక్లైన్, ఓసీపీ5, సివిల్, సెక్యూరిటీ, హాస్పిటల్, ఏరియా వర్క్‌షాప్, సీఎం కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులు వేలంపాటను వ్యతిరేకి స్తూ ప్రజల ఉపాధి కార్మికుల ఉద్యోగ భద్రత కోసం కదం తొక్కారు. టీబీజీకేఎస్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, కేంద్ర నాయకులు ఎల్ వెంకటేష్, పోలాడి శ్రీనివాసరావు, ప్రవీణ్, ఐ సత్యనారాయణ, రాజేశం, దూట శేషగిరి, వివిధ గనుల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

బొగ్గు వేలానికి వ్యతిరేకంగా గేట్ మీటింగ్

గోదావరిఖని, జూలై 1: కేంద్రంలోని బీజేపీ, ఎన్‌డీఏ ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణి కేటాయించకుండా మల్టీనేషన్ కంపెనీలకు అప్పగించడానికి ఏర్పాటు చేసిన వేలం పాటను వ్యతిరేకిస్తూ సింగరేణి వ్యాప్తంగా విప్లవ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచారంలో భాగంగా సోమఎవారం ఆర్జీ-1 జీడీకే 11ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, నాయకులు జక్కుల నారాయణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, నాయకులు ఈ నరేష్, టీఎస్‌యూఎస్ నాయకులు కుమారస్వామి, నీరటి రాజన్న, ఏఐఎఫ్‌టీయూ నాయకులు జీ రాములు, రాయమల్లు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఈ రాజేందర్, టీఎన్‌టీయూసీ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, ఏడుకొండలు, దామోదర్ రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు ఎం కొమురయ్య, ఎడ్ల రవి కుమార్, పీ మొండయ్య, శేఖర్, పోచమల్లు, దేవి సత్యం, రత్నకుమార్, రాయపోషం పాల్గొన్నారు.